14112024-MAI-06_Layout 1 11/14/2024 2:29 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## పర్యావరణ నిధుల సమస్య

**తుఫాన్లు** తరుముతుంటే బతుకు జీవుడా అంటూ జనం సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయడం, దుర్భరమైన వడగాలులకు పొలాల్లోని, ఫ్యాక్టరీల్లోని పనివారు, విహారయాత్రలకు వచ్చిన యాత్రికులు సొమ్మసిల్లి పడిపోవడం, వరదలు ఊళ్లను ముంచెత్తి బీభత్సం సృష్టించడం, కరవుకాటకాలతో పంటలెండుతుంటే ఆకలి కేకలు మిన్నంటడం.. ఇవీ మానవ కల్పిత ప్రకృతి విధ్వంసం వల్ల 2024లో ప్రపంచ దేశాలు చూసిన కల్లోలాలు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రపంచంలోని ఏ ఒక్క దేశమూ ఈ దుష్ప్రభావాల నుంచి తప్పించుకోలేకపోతున్నది. 2015 నుంచి 2024 మధ్యకాలంలో భూమి రికార్డు స్థాయి గరిష్ఠ ఉష్ణోగ్రతలతో ఉడికిపోయింది. ఇక 2024 సంవత్సరమైతే వేడిమిలో రికార్డులు బద్దలు కొట్టింది. ఇంతటి ఆందోళనకరమైన పొగలు, సెగల మధ్య అజర్‌బైజాన్ రాజధాని బాకూలో కాప్ 29 పర్యావరణ సదస్సు ప్రారంభమైంది. ఈ ఏడాది జరిగిన పరిణామాలు మరువరాని గుణపాఠమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ప్రారంభోపన్యాసంలో చేసిన హెచ్చరిక ప్రత్యక్షర సత్యం.

సంపన్న దేశాల వాటా పెంపుపై సంప్రదింపులు జరిపేందుకు ఏర్పాటైన బాకూ సదస్సును 'ఫైనాన్స్ కాప్' అని కూడా పిలుస్తున్నారు. పర్యావరణ అనుకూల ఇంధనానికి మారడంతో పాటు భూతాప సమస్యల పరిష్కారం కోసం వర్ధమాన దేశాలకు ఏటా 100 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందించేందుకు 2009లో సంపన్న దేశాలు అంగీకరించాయి. అయితే, ఆ చెల్లింపులు 2020లో మొదలయ్యాయి. 2022లో మాత్రమే పూర్తిస్థాయి చెల్లింపులు జరిగాయి. ఈ ఏడాది అంటే 2024తో ఈ చెల్లింపుల గడువు తీరిపోతుంది. వచ్చే ఏడాది నుంచి కేటాయింపులు భారీగా పెరగాలని భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు బాకూ సదస్సులో రెండవ రోజైన బుధవారం పట్టుబట్టాయి. అంతే కాకుండా పెట్టుబడులు, సాంకేతికత బదిలీ అవసరం ఎంతైనా ఉన్నదని, పైగా ఎలాంటి వివక్షలు లేకుండా అన్ని దేశాలకు సమాన స్థాయిలో సహాయం అందించాలని కూడా నొక్కిచెప్తున్నాయి. పర్యావరణ మార్పులు ఆరోగ్యంపైనే కాకుండా, ఆర్థికంగానూ ప్రభావితం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దిగజారుతున్న పర్యావరణ పరిస్థితులు ద్రవ్యోల్బణానికి ఎప్పటికప్పుడు కొత్త జీవం పోస్తాయని, ప్రభుత్వాలపై, ప్రజలపై భారీగా ఆర్థికభారం మోపుతాయని ఐరాస పర్యావరణ విభాగం ఉన్నతాధికారి సైమన్ స్టియన్ హెచ్చరించడం గమనార్హం.

వాతావరణ మార్పుల సమస్యను కొట్టిపారేసే డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన నేపథ్యంలో అమెరికా సాయం తగ్గుతుందేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే గనుక జరిగితే నిధులకు భారీ లోటు ఏర్పడుతుంది. ఇతర దాత దేశాలు ఆ లోటును పూడ్చటం అంత సులభం కాదు. మరోవైపు చైనా వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు, చమురు సంపద కలిగిన గల్ఫ్ దేశాలు సైతం తమ వంతుగా పర్యావరణ సహాయాన్ని సమకూర్చాలని సంపన్న దేశాలు వాదిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దీర్ఘకాలిక పారిశ్రామిక దేశాలతో సమానమైన జవాబుదారీ తనకు ఉండదని చైనా అంటున్నది. ఈ తరహా మల్లగుల్లాల కారణంగా నవంబర్ 22న సదస్సు ముగిసే నాటికి నిధుల పరిమాణం భారీగా పెంచే విషయమై ఏకాభిప్రాయం కుదురుతుందో, లేదో తెలియడం లేదు. భూతాపం తగ్గింపుపై చల్లని వార్త కోసం బాకూ సదస్సు వైపు ప్రపంచం ఆశగా చూస్తున్నది. మహోత్పాతం దిశగా మానవాళి వేగంగా పరుగెడుతున్నందున పర్యావరణ పరిరక్షణకు వెచ్చించాల్సిన నిధులపై సంపన్న దేశాలు విశాల హృదయంతో ముందుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నోరు తెరిచిన పంజరంలా.. సర్కారే!



డాక్టర్ ఆంజనేయగౌడ్

చాలా రోజులుగా నిద్రలేని రాత్రులు గడుపుతున్న రైతులకు మొన్న అర్ధరాత్రి ఇనుపబూట్ల శబ్దం వినపడకుండా ఉంటుందా? వెలుగులు ఆపేసి, నోళ్లు కట్టేసి, గడప, గడపలోకి తుపాకులు తొంగి చూస్తుంటే.. ఆ పల్లెల గుండెలు ఎంత గాయపడి ఉంటాయో కదా..? ఏడాది కిందట ఇంటింటికీ గ్యారెంటీ కార్డులు పంచిన రేవంత్‌రెడ్డి.. రాత్రంతా ప్రతి రైతుకు బేడీలు పంపిస్తుంటే వారు ఎంత బాధపడి ఉంటారో కదా. లగచర్లలో జరిగిన రైతుల నిరసన ఉద్యోగుల గాయాలకు దారితీయడం అవాంఛనీయమే. ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని ఖండించాల్సిందే. అయితే, ఆవేదన అనుకోకుండా అంటించిన ధర్మాగ్నికి కుట్రకోణం ఆపాదించి, నిర్బంధం నీడలో అనుకున్నది నెరవేర్చుకునే నక్కజిత్తులమారితనమే అందరికీ అసహ్యం కలిగిస్తున్నది.



సొంత ఇలాకాలో కల్లోలం సృష్టించి, కర్షకుల కన్నీరును పారించిన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. 'మీ కన్నబిడ్డలా తోడుంటా'నని నమ్మబలికితే.. కల్వకుర్తి నుంచి వచ్చినా రేవంత్‌ను కొడంగల్ కడుపులో పెట్టుకున్నది. మళ్లొక్కసారి దీవిస్తే నియోజకవర్గానికి పెద్ద పదవి వస్తుందని చెప్పగానే భుజానికెత్తుకొని అందలమెక్కించారు అక్కడి ప్రజలు. ఆ పెద్ద పదవే ప్రాణసంకటంగా దాపురిస్తుందని వారు ఆనాడే ఎలా ఊహించగలరు..?

తెలంగాణ ఏర్పాటుకు మునుపు ఉమ్మడి పాలమూరు జిల్లా పడిన వేదన, ఆ జిల్లా వాసుల వలస బతుకులు అందరికీ తెలిసిందే. అందులోనూ కొడంగల్ నియోజకవర్గానిది మరింత దుర్భిక్ష పరిస్థితి. కొసలో విసిరేసినట్లు, ప్రభుత్వాల కంటికే కానరానట్లుగా కొడంగల్ కన్నమ్మ కష్టాలు మోసింది. అప్పులు పెంచిన అమాయకులు, ఆకలి మింగిన బక్క జీవుల కేంద్రం కొడంగల్. గిరిజనులు, దళితులు, బలహీనవర్గాలు అత్యధికంగా నివసించే ఆ నియోజకవర్గంలో అభివృద్ధి మాట దేవుడెరుగు ధైర్యంగా జీవించడమే గగనం. అలాంటి ప్రాంతాన్ని పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం పచ్చదనానికి, ప్రజా వికాసానికి వేదికగా మలిచింది. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ తదితర 450 సంక్షేమ పథకాలు బీదరికంతో తలపడుతున్న కొడంగల్ ప్రజానీకానికి కొండంత భరోసాను కల్పించాయి. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ పథకాలతోనే సరిపెట్టకుండా నాటి కేసీఆర్ ప్రభుత్వం కొడంగల్‌ను కష్టాల నుంచి గట్టెక్కించడానికి ఇంకా ఎన్నో విధాల ఆసరాగా నిలిచింది.

గిరిజనులైన లంబాడీలు అధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో కొడంగల్ కూడా ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి.. 'మా తండాలో మా రాజ్యం' అనే దశాబ్దాల వారి స్వయం పాలనా ఆకాంక్షను సాకారం చేశారు కేసీఆర్. ఆ నియోజకవర్గంలోని ఒక్క ఉమ్మడి బొమ్మరాస్ పేట్ మండలంలో దాదాపుగా 76 లంబాడీ తండాలుంటే, వాటిలో 23కు పైగా తండాలు గ్రామ పంచాయతీలుగా కొలువుదీరాయి. ప్రతి తండాకు రోడ్లు, త్రీ ఫేస్ కరెంట్ సరఫరా, ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీరు తదితర అనేక శాశ్వత కీలక మౌలిక సదుపాయాలను కేసీఆర్ సర్కార్ కల్పించింది.

> **నియోజకవర్గ కేంద్రంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు సేవాలాల్ బంజారా భవన్ నిర్మించి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేసింది. లంబాడీలతో పాటు మొత్తం కొడంగల్ నియోజకవర్గానికే కొత్త చరిత్రను దిద్దింది బీఆర్‌ఎస్ సర్కార్. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 100కు పైగా పెద్ద చెరువుల్లో పూడిక తీసి వాటిని పునరుజ్జీవింపజేసింది.**

అంతేకాదు, దౌల్తాబాద్ పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి పరిచింది. తద్వారా ఈ చెరువుల కింద వేలాది ఎకరాలు సాగులోకి వచ్చాయి, సిరులు పండాయి. పదేండ్లలోనే వికారాబాద్ జిల్లాలో అత్యధిక వరి పండించే నియోజకవర్గంగా కొడంగల్ కొత్త పొద్దుకు సద్దిమూటగా మారింది. రైతుల కష్టానికి అండగా ఉండేందుకు కొడంగల్ కేంద్రంలో నూతనంగా మార్కెట్ యార్డును కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించింది. అలాగే మాతాశిశు మరణాల రేటు అత్యధికంగా నమోదవుతూ, దుఃఖాన్ని కంటున్న కొడంగల్‌లో 100 పడకల దవాఖాన, కోస్గిలో 50 పడకల ఆసుపత్రులను ప్రారంభించింది. అంతేకాదు, గ్రామ పంచాయతీలుగా అవస్థలు పడుతున్న కొడంగల్, కోస్గి పట్టణాలను నూతన మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసింది కేసీఆర్ ప్రభుత్వం. కొడంగల్ పట్టణానికి నీటి ఇక్కట్లు లేకుండా చేసేందుకు శాశ్వత నీటి సరఫరా వ్యవస్థను గులాబీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి అనే మూడు నూతన మండలాలను ఏర్పాటు చేసింది. అంతేకాదు, ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలిచింది.

మూలకు విసిరేసినట్లు, ఏ ఎదుగుదల లేని కొడంగల్ పల్లెలు పదేండ్ల కేసీఆర్ పాలనలో ఎంతో పురోగతి సాధించాయి. ఊరూరా రహదారులతో పాటు మన్నెగూడ నుంచి మాతా మాణికేశ్వరి ఆలయం వరకు రాష్ట్ర హైవేను పూర్తి చేయడంతో రవాణా సౌకర్యాలే కాదు, భూముల విలువ వందల రెట్లు పెరిగాయి. పదేండ్లకు మునుపు ఎకరానికి రూ.5 లక్షలు కూడా పలకని భూముల విలువ 2023 నాటికి ఎకరం రూ.30-50 లక్షలకు చేరుకున్నది. కొడంగల్ పట్టణానికి రెండు కిలోమీటర్ల పరిధిలో ఎకరా ధర రూ.2 కోట్లకు ఎగబాకడంతో అక్కడి భూములు బంగారమయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా శాశ్వత కరువు విముక్తి కోసం చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకం పనులను 95 శాతానికి పైగా కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా కొడంగల్ నియోజకవర్గ పరిధిలో దాదాపు 1.30 లక్షల ఎకరాలకు సాగునీరందేలా చేసింది. ఇలా ఎన్నో విధాల అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధిని పారించినట్లే.. కొడంగల్ నియోజకవర్గాన్ని సైతం ప్రగతి పథాన నడిపించింది కేసీఆర్ సర్కార్. అట్టడుగున ఉన్న కొడంగల్ నియోజకవర్గాన్ని ఆకాశమే హద్దుగా ఎదిగేందుకు బాటలు వేసిన బీఆర్‌ఎస్ అక్కడి జనానికి ధర్మ యోధుడవుతుందే తప్పు, రేవంత్ రెడ్డి ఆరోపించినంత మాత్రాన కుట్రదారిగా కనిపించదు కదా..!

> **పదేండ్ల కేసీఆర్ పాలనలో కుదుటపడి, విలువను సంతరించుకున్న కొడంగల్ ప్రాంతాన్ని ఏడాదిలోపే కొట్లాటకు కేంద్రంగా రేవంత్‌రెడ్డి సర్కార్ మార్చడం విషాదం. పాలు పోసిన చేతికే కాటు వేసినట్టు.. గెలిపించిన నియోజకవర్గ రైతులనే దురాశతో మట్టికరిపించాలని అనుకోవడం ఏ రాజకీయ సంస్కృతికి నిదర్శనమో కాంగ్రెస్ పాలకులకే తెలియాలి. 'మా భూమి మాకేనని' తిరగబడ్డ రైతులపై కుట్రదారులని అభియోగం మోపి హత్యాయత్నం సహ అనేక కేసులు నమోదు చేయించి, జైలుకు పంపించడం దుర్మార్గపు పాలనకు నిదర్శనం.**

నిజానికి అసలు కుట్రదారులెవ్వరు..? 12 వేల ఎకరాల భూమి సేకరించి, ఫార్మాసిటీ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం. ఆ ఫార్మాసిటీని రద్దు చేసి, ఫార్మా కంపెనీ పేరిట కొడంగల్ రైతుల నుంచి విలువైన 1200 ఎకరాలను సేకరించాలని అనుకోవడమే కుట్ర కదా? కంపెనీల ఏర్పాటు అవసరమే. కానీ, కుటుంబ సభ్యులను కార్పొరేట్ శక్తులుగా మలిచేందుకు, వేలాది మంది ఫార్మర్ల ఫ్యామిలీలపై ఫార్మా బాంబులేయడం అమానవీయ సర్కార్ విధానాలకు అద్దం పడుతున్నది కదా..!

అయినా 'చేరుకోలేనంత దుర్భేద్యం కాను, కలుసుకోలేనంత దూరం కాను' అంటూ గప్పాలు కొట్టిన ముఖ్యమంత్రికి సొంత నియోజకవర్గ రైతుల ఆవేదన వినేందుకు మనసు రాకపోవడం వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో అందరికీ అర్థమైపోయింది. ఆరు నెలల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్న కొడంగల్ అన్నదాతల వేదన వినేందుకు కూడా మనసురాని ముఖ్యమంత్రిని ఏ పేరుతో పిలవాలి..? అల్లుడి కళ్లలో ఆనందం కోసం అన్నదాతలను కారాగారంలోకి నెట్టివేసే ప్రభుత్వం ఎంత కర్కశమైనదో కదా..! ప్రాణం కంటే విలువైన వారసత్వ పొలాలు వదిలేయాలంటే రైతులు ఎంత విలవిల్లాడుతారో పోలీస్ పటేల్ వారసత్వం ఉన్న పాలకులకు అర్థమవుతుందని అనుకోవడం మూర్ఖత్వమే. ఇప్పటికీ కనీసం సొంత నియోజకవర్గ రైతులనే కనికరం కూడా లేకుండా, తల్లి పిల్లలను ఎత్తుకెళ్లి కటకటాల్లోకి నెడుతున్నారు. చివరికి రైతుల పక్షాన మాట్లాడినందుకు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి పైశాచికత్వం ప్రదర్శించారు. ఇదేం పాలన..? సర్కారే రెక్కలు చాపిన పంజరమై రైతులోకాన్ని చెరసాలల పాలుచేస్తున్నది.

ఆవేదనతో కూడిన రైతాంగం పోరాటం చూస్తున్నప్పుడు ఏడాది కిందట ఇంద్రవెల్లి స్మారక స్థూపం పరిసరాల్లో సభ పెట్టి రేవంత్ రెడ్డి పలికిన ప్రగల్భాలు ఎవరికైనా గుర్తుకురాకుండా ఉంటాయా? జీవనాధారమైన తమ భూములు అన్యాక్రాంతమవుతున్న అన్యాయానికి నిరసనగా 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో నిరసన సభకు ఆదివాసీ రైతులు పిలుపునిచ్చారు. ఆ సభపై నిషేధం విధించిన నాటి కాంగ్రెస్ సర్కార్ వెల్లువలా తరలివస్తున్న రైతాంగంపై తూటాల వర్షం కురిపించింది. ఆ పోరాటంలో అమరులైన వారి స్మారకార్థం నిర్మించిన స్థూపం ముందు నిలబడి నాడు రేవంత్‌రెడ్డి పలికిన ప్రగల్భాలు గుర్తొస్తే నవ్వు, దానివెంటే బాధ కలుగకమానవు. నాటి ఇంద్రవెల్లి దుర్మార్గం నుంచి నేటి లగచర్ల దాష్టీకం వరకు రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీది రాబందు దృష్టికోణమేనని తేటతెల్లమైంది. నాడు ఇంద్రవెల్లి దుర్ఘటనకు ముందు, తర్వాత ఆ ప్రాంతంలో అమలైన నిర్బంధమే నేడు కొడంగల్ నియోజకవర్గమంతా అమలవుతున్నది. కొడంగల్‌లో మాత్రమే కాదు, రాష్ట్రమంతటా ప్రకటిత, అప్రకటిత పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నది. బాధితులను కలిసే వీలు లేదు, నిరసనలకు చోటేలేదు. ఆట, మాట, పాటపై అక్రమ కేసుల ఆంక్షల వల వేసేసింది కాంగ్రెస్ సర్కార్. ఇంత దుర్మార్గపు పాలన కొనసాగుతుంటే.. కూనమనేని సాంబశివరావు, కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ సర్కార్‌కు కాపలాగా కొడవలి పట్టుకొని నిలబడుతుండటమే విచిత్రంగా ఉంది. బండి సంజయ్ లాంటి నేతలు రేవంత్‌రెడ్డి చేతిలో కమలం పెట్టి కథలు చెబుతుండటమే ఆవేదన కలిగిస్తున్నది. అందుకే ఇప్పుడు తెలంగాణ తల్లడిల్లుతున్నది.

> **వివాదమే విధానంగా అలవర్చుకొని, వికాసమెరుగని పాలనను సాగిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా అబాసుపాలైపోయింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. కానీ, ఆగమైపోతున్నది పోరాడి తెచ్చుకున్న స్వరాష్ట్రం. అందుకే ఇప్పుడు నాలాంటి తెలంగాణవాదులకు బాధ కలుగుతున్నది.**

*(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)*

# రాజకీయ కక్ష.. ప్రత్యర్థికే రక్ష



బసవరాజు నరేందర్‌రావు
99085 16549

నంద వంశ పాలనకు సమాధి కట్టి, చంద్రగుప్తుడిని మగధ సామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టాభిషిక్తున్ని చేసిన అపర మేధావి, రాజనీతిజ్ఞుడు చాణుక్యుడు. ఒక విజేత తన ప్రత్యర్థి పట్ల ప్రవర్తించాల్సిన తీరుని ఆయన ఏనాడో చేతల ద్వారా ప్రపంచానికి తెలియజేశారు. ఆ కాలంలో చాణక్యుడికి సమఉజ్జీ రాక్షసామాత్యుడు. ఆయన నంద చక్రవర్తికి ప్రధానమంత్రి. ఒక విధంగా చెప్పాలంటే.. రాజనీతిజ్ఞతలో చాణక్యుడి కంటే కూడా నాలుగు ఆకులు ఎక్కువ చదివినవాడే. ఈ విషయం చాణక్యుడికి కూడా తెలుసు.



చంద్రగుప్తుడు గద్దెనెక్కడంతో రాక్షసామాత్యుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చంద్రగుప్తుని శత్రువులతో చేతులు కలిపి అతని పతనానికి కుట్రలు చేయసాగాడు. రాక్షసామాత్యుని కుట్రలను తెలుసుకున్న చాణక్యుడు అతని రహస్య స్థావరాన్ని వేగుల ద్వారా తెలుసుకున్నాడు. అతన్ని కలిసి, రాజధాని పాటలీపుత్రానికి ఆహ్వానించాడు. రాజ్య శ్రేయస్సు దృష్ట్యా చంద్రగుప్తుని వద్ద అమాత్యుడిగా ఉండాలని కోరాడు. అయితే, మొదట నిరాకరించినా చాణక్యుడు నచ్చచెప్పడంతో చంద్రగుప్తుని కొలువులో ప్రధానమంత్రిగా చేరాడు రాక్షసామాత్యుడు.

వాస్తవానికి, అప్పటివరకు చంద్రగుప్తుడు, చాణక్యుడిని చంపడానికి రాక్షసామాత్యుడు ప్రయత్నించాడు. రాక్షసామాత్యుడు దొరికితే అతన్ని చంపేయాలన్న కసితో ఉన్నాడు చంద్రగుప్తుడు. అలాంటి శత్రువును సగౌరవంగా తీసుకొచ్చి 'ఇక నుంచి రాక్షసామాత్యుడే నీ ప్రధానమంత్రి' అని చాణక్యుడు చెప్పగానే చంద్రగుప్తుడు నిర్ఘాంతపోయాడు. అయి తే, తన నిర్ణయం వెనకున్న రాజనీతిని చాణక్యుడు వివరించి చెప్పడంతో.. రాక్షసామాత్యుడిని సగౌరవంగా ఆహ్వానించి, అమాత్యుడిగా నియమించుకున్నాడు చంద్రగుప్తుడు. తర్వాత రాక్షసామాత్యుడు అమూల్యమైన సేవలందించి మౌర్య సామ్రాజ్య సుస్థిరతకు దోహదపడ్డాడు.

> **చాణక్యుడు దీని ద్వారా ప్రపంచానికి ఒక గొప్ప సందేశమిచ్చాడు. అదేమిటంటే.. రాజకీయ కక్ష-ప్రత్యర్థికి రక్ష. ఒక పాలకుడికి ప్రత్యర్థి మీద ఉండే కక్ష, అతనికి ఏ మాత్రం మేలు చేయకపోగా కీడు చేస్తుందని దానర్థం. పైగా అది ప్రత్యర్థికి రక్షణ కవచంగా మారుతుంది. అందువల్ల పాలకులెవరైనా తమ ప్రత్యర్థుల పట్ల రాజకీయ కక్షను విడనాడి, ప్రత్యర్థిలోని ప్రజ్ఞాపాటవాలను, అనుభవసారాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలి. ఒకవేళ చాణక్యుడు గాని, చంద్రగుప్తుడు గాని రాక్షసామాత్యుని పట్ల కక్షపూరితంగా వ్యవహరించి ఉంటే మౌర్య సామ్రాజ్యం ఏనాడో పతనమయ్యేది.**

మన దేశానికే చెందిన అపర మేధావి, రాజనీతిజ్ఞుడు చాణక్యుడి సందేశాన్ని నేటి రాజకీయ నాయకులు ఏ మాత్రం అర్థం చేసుకోవడం లేదు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని చెప్పే రాజకీయ నాయకులెందరో.. అనుకూల పవనాలు వీచి అధికారం చేజిక్కుంచుకోగానే ఆ మరుక్షణం నుంచి 'ప్రజాపాలన'ను విస్మరిస్తున్నారు. ప్రత్యర్థుల మీద కక్ష తీర్చుకోవడానికి తమ సర్వశక్తులను ధారపోస్తున్నారు. ఈ కక్షపూరిత రాజకీయాలు పాలకులకే శాపాలుగా మారడమే కాకుండా, ప్రత్యర్థులకు రక్షణ కవచాలుగా మారుతున్నాయన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదు. పాలకుడి ప్రవర్తన తన ప్రత్యర్థి పట్ల కక్షపూరితంగా మారుతున్నదని భావన కలిగిన మరుక్షణం నుంచే ప్రజలు అతన్ని ఏవగించుకుంటున్నారు. అది క్రమేణా బలపడి ఆ పాలకుడి పతనానికే దారితీస్తున్నది.

మన దేశ రాజకీయ చరిత్ర పుటలను ఒకసారి పరికించి చూస్తే.. గాలివాటున అధికారం చేజిక్కుంచుకున్న ఎందరో పాలకులు తమ ప్రత్యర్థులను శారీరకంగా, మానసికంగా హింసించిన ఘటనలు మనకు కనిపిస్తాయి. అంతటితో తృప్తిచెందని చాలామంది అక్రమ కేసులు పెట్టి వారిని జైలుపాలు చేసి రాక్షసానందం కూడా పొందుతున్నారు. రాజకీయ కక్షలకు పాల్పడుతూ, పాలనను గాలికొదిలేసే అలాంటివారికి చివరికి దక్కే ఫలితం ఏమిటంటే.. పదవీ భ్రష్టత్వం. ఇలాంటి మనస్తత్వం ఉన్న పాలకులను ప్రజలు ఏ చేతులతో అయితే గద్దెనెక్కించారో అవే చేతులతో గద్దె దించుతారు.

> **ఒక పాలకుడు తన ప్రత్యర్థి పట్ల వ్యవహరించే వైఖరిని మాత్రమే కాదు, ప్రత్యర్థి పట్ల వాడే పరుష భాషను కూడా ప్రజలు సునిశితంగా గమనిస్తుంటారు. బూతు మాటలు, పరుష పదజాలం, తిట్ల దండకం తమ భజనపరుల కరతాళ ధ్వనులకు పనికొస్తాయే తప్ప, పాలకుడు వాడే అటువంటి భాష అతనికి ఏ మాత్రం శోభనివ్వదు. అంతేకాదు, ఆ నాయకుడిలోని అల్పత్వానికి, కుసంస్కారానికి అది దర్పణం పడుతుంది.**

ప్రజలు అమాయకులని కొందరు నేతలు నమ్ముతుంటారు. ప్రజలు ఎంతో తెలివైనవాళ్లన్న విషయం వారికి తెలియదు. పాలకుల ప్రతీ చర్యను, ప్రతి అడుగును, ప్రతి మాటను ప్రజలు గమనిస్తుంటారు. అంతేకాదు, వాటి ద్వారా నేతల వ్యక్తిత్వాన్ని నిర్ధారిస్తారు. అందుకు తగ్గట్టుగా వేయాల్సిన సమయంలో వారికి మార్కులు వేస్తారు.

ఇటీవల ముగిసిన అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, కమలా హ్యారిస్ ఓటమికి సందర్భం లేకుండా ఆమె పగలబడి నవ్వడం కూడా ఒక కారణమని అమెరికా రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అంటే.. రాజకీయ నాయకుల ఉత్థాన పతనాల్లో చిన్న చిన్న అంశాలు కూడా ప్రాధాన్యం వహిస్తాయని దీని ద్వారా తెలుస్తున్నది. ఇంత చిన్న విషయాలను కూడా పరిశీలించే ప్రజలు ఒక పాలకుడు తన ప్రత్యర్థి పట్ల వ్యవహరించే తీరును పరిశీలించకుండా ఉంటారా? ప్రత్యర్థులపై పాలకులు కక్ష పెంచుకుంటే చూస్తూ ఊరుకుంటారా? అందువల్ల పాలకులెవరైనా సరే తమ ప్రత్యర్థుల పట్ల కక్ష మా ని, ప్రజాశ్రేయస్సుపై దృష్టిసారించాలి. అలాంటి వారే నాలుగు కాలాల పాటు మనగలుగుతారు. లేకపోతే అతి తక్కువ కాలంలోనే చరిత్ర పుటల్లో మరుగున పడిపోతారు.

> **ఎన్నికల్లో గెలుపోటములు సహజమని చెప్పే రాజకీయ నాయకులెందరో.. అనుకూల పవనాలు వీచి అధికారం చేజిక్కుంచుకోగానే ఆ మరుక్షణం నుంచి ప్రజాపాలనను విస్మరిస్తున్నారు. ప్రత్యర్థుల మీద కక్ష తీర్చుకోవడానికి తమ సర్వశక్తులను ధారపోస్తున్నారు. ఈ కక్షపూరిత రాజకీయాలు పాలకులకే శాపాలుగా మారడమే కాకుండా, ప్రత్యర్థులకు రక్షణ కవచాలుగా మారుతున్నాయన్న వాస్తవాన్ని పాలకులు గ్రహించడం లేదు.**

'మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి' అని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊరూవాడా తిరిగి కాంగ్రెస్ నాయకులు ఊదరగొట్టారు. కాంగ్రెస్ నేతల ప్రగల్భాలు చూసిన కేసీఆర్ ప్రజలకు హితవు పలికారు. 'కాంగ్రెస్‌కు అవకాశమిస్తే తినే కంచంలో మన్ను పోసుకున్నట్టే'నని ప్రతి సభలోనూ చెప్పారు. కానీ, ప్రజలు మాత్రం కాంగ్రెస్ నేతల మాయమాటలను నమ్మారు, అధికారం కట్టబెట్టారు.

# ఇదేనా కోరుకున్న మార్పు?



శ్రీధర్ ప్రసాద్



రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే అన్నింట్లో 'మార్పు' చేసి చూపిస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టే తెలంగాణలో వారి పాలన సాగుతున్నది. 11 నెలల రేవంత్ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న మార్పులే అందుకు నిదర్శనం. సంక్షేమం నుంచి సంక్షోభం వైపు, వికాసం నుంచి విధ్వంసం వైపు, నిర్మాణం నుంచి కూల్చివేతల వైపు... మార్పు స్పష్టంగా కనిపిస్తున్నది.

తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని గతంలో కాంగ్రెస్ నేతలు పదే పదే ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అప్పులే చేయబోమని కూడా చెప్పారు. కానీ, గద్దెనెక్కిన 11 నెలల్లోనే సుమారుగా రూ.80 వేల కోట్ల అప్పు చేసి కాంగ్రెస్ మార్క్ మార్పును చూపించారు. అధికార పీఠమెక్కగానే రుణమాఫీ చేస్తామని, రైతుభరోసా పథకం ద్వారా ఎకరాకు రూ.7500, కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. కానీ, అవన్నీ చేయకపోగా కేసీఆర్ సర్కార్ ఇస్తున్న రైతుబంధును కూడా నిలిపివేశారు. రైతుల జీవితాలను రోడ్డున పడేసి కొత్త మార్పు తెచ్చారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో గుండె మీద చెయ్యి వేసుకొని, మీసం మెలేసిన రైతన్నలు కాంగ్రెస్ హయాంలో అష్టకష్టాలు పడుతుండటమే అందుకు తార్కాణం.

ఆడబిడ్డల పెండ్లిళ్లకు కేసీఆర్ సర్కార్ రూ.లక్ష ఇస్తుంటే.. దానికి అదనంగా తులం బంగారం కూడా ఇస్తామని హస్తం పార్టీ నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు తులం బంగారం సంగతి దేవుడెరుగు కల్యాణలక్ష్మికే కాసులు లేవని చెప్తూ పెద్ద మార్పే తీసుకొచ్చారు. పింఛన్ రూ.4 వేలకు పెంచకపోగా.. రూ.2 వేలను ఎగ్గొట్టి అసలైన మార్పు చేశారు.

> **రేవంత్ పాలనలో ధర్నాలు, నిరసనలతో తెలంగాణ అట్టుడుకుతున్నది. పదేండ్ల పాటు కానరాని ఆందోళనలు మళ్లీ ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన పోలీస్ యాక్ట్ అసలు సిసలు మార్పు. ఉద్యోగ నియామకాలపై నిరుద్యోగులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ అటకెక్కగా.. అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాల మార్పులకు అశోక్‌నగర్ సాక్ష్యంగా నిలుస్తున్నది.**

బంగారు పళ్లెంలో పంచభక్ష్య పరమాన్నాలతో కూడిన రాష్ర్టాన్ని కాంగ్రెస్ చేతిలో కేసీఆర్ పెట్టారు. వడ్డించిన విస్తరిలా ఉన్న తెలంగాణను సర్వనాశనం చేసిన రేవంత్ సర్కార్ ధనిక రాష్ర్టాన్ని దివాలా తీయించి సరికొత్త మార్పునకు నాంది పలికింది. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట పేద, మధ్యతరగతి ప్రజల గూళ్లను కూలుస్తూ వారి బతుకుల్లో మార్పును తీసుకొచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసం కారణంగా ఖజానాకు భారీగా గండిపడిన మార్పు స్పష్టంగా లెక్కలతో సహా కనిపిస్తున్నది. గొర్రెలు, చేప పిల్లల పంపిణీ ద్వారా కేసీఆర్ పశుసంపదను పెంచి, కులవృత్తులను ప్రోత్సహించారు. చేప పిల్లలు, గొర్రెల పంపిణీని నిలిపివేసి కులవృత్తులకు ఉరివేసిన రేవంత్‌రెడ్డి.. ఊహకందని మార్పు తీసుకొచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నించినవారిపై, తమ హక్కుల కోసం నినదిస్తున్నవారిపై, గళమెత్తుతున్నవారిపై అక్రమ కేసులు పెట్టే మార్పు వచ్చింది.

తెలంగాణవ్యాప్తంగా అనేక రంగాల్లో వచ్చిన మార్పు మన కండ్లముందే కనిపిస్తున్నది. అంటే చెప్పిన విధంగా కాంగ్రెస్ మార్పు తీసుకొచ్చినట్టే కదా? 'మార్పు కావాలి- కాంగ్రెస్ రావాలి' అన్న నినాదం విజయవంతమైనట్టే కదా!